# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికాప్రకటన-3 తేది. 02-11-2014

తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశ విత్తన భాండాగారంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ఉన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయడానికి, సమగ్ర అధ్యయనం చేయడానికి ఛత్తిస్ గఢ్ పర్యటనలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. మొదటి రోజు పర్యటన అంతా పంట పొలాలు, వ్యవసాయ క్షేత్రాలు, గ్రీన్ హౌజ్ సందర్శనలు, పాలి హౌజ్ పరిశీలనలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవడం, విత్తన పరిశోధకులతో మాట్లాడటం, రైతులతో ముఖాముఖి చర్చలు జరపడంతో బిజి బిజీగా గడిపారు. విమనాశ్రయం నుంచి నేరుగా గోమ్చీలోని వి.ఎన్.ఆర్. సీడ్స్ రీసర్చ్ స్టేషన్‌ను సందర్శించారు. రీసర్చ్ స్టేషన్ ఎండి విమల్ చౌదాతో పాటు ఇతర నిపుణులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విత్తన ఉత్పత్తి, కూరగాయలు, పండ్ల తోటల సాగు తదితర అంశాలపై వివరాలు అందిచారు. ముఖ్యమంత్రి కూడా ఈ సందర్భంగా వారిని పలు ప్రశ్నలు అడిగారు. సందేహాలు నివృత్తి చేసుకున్నారు. రీసర్చ్ స్టేషన్‌లో కలియ తిరిగారు. అక్కడ విత్తనం పెట్టిన దగ్గనుండి చెట్టు మొలకెత్తే వరకు వివిధ దశలను పరిశీలించారు. ఎక్కువ దిగుబడులు రావడానికి, మంచి విత్తనాలను ఉత్పత్తి చేయడానికి అక్కడ అవలంభిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న నిపుణులు కూడా తెలంగాణ రాష్ట్రం ఛత్తిస్ గఢ్ మాదిరిగానే విత్తన ఉత్పత్తికి అనువైన ప్రాంతమని చెప్పారు. ముఖ్యమంత్రి వారికి బదులిస్తూ తెలంగాణను భారతదేశ విత్తన భాండాగారంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణలో ఎర్ర నేలలు, నల్ల నేలలు, చౌడు భూములు ఉన్నాయని, ఇవన్ని కూడా వివిధ రకాల విత్తన ఉత్పత్తికి అనువైనవని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి దుర్గ్ జిల్లాలోని మాల్ పురి గ్రామ పరిధిలో వందలాది ఎకరాల్లో సాగవుతున్న కూరగాయలు, పండ్లతోటలను సందర్శించారు.

జామ, టమాట, అరటి, దోస, వంకాయ, అల్లం, క్యాబేజి, కాలీఫ్లవర్, దానిమ్మ, కర్జూర తదితర పంటలను తిరిగి సందర్శించారు. అక్కడ ప్రతి ఇంచూ నేల కూడా బిందు సేధ్యం ద్వారా సాగవుతున్న సంగతిని పరిశీలించారు. బింధు సేధ్యం వల్ల మొక్కలకు నేరుగా నీరు అందడంతో పాటు తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంటను సాగు చేసే పద్దతులను పరిశీలించారు. ట్రాక్టర్ల ద్వారానే పురుగు మందులను పిచికారి చేస్తున్న విధానాన్ని కూడా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్న సంగతిని అక్కడి రైతులకు, వ్యవసాయ రంగ నిపుణులకు చెప్పారు. ఈ బడ్జెట్‌లోనే డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయిస్తున్నామని, దశల వారిగా డ్రిప్ ఇరిగేషన్‌ను అభివృద్ధి పరుస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించాలని అక్కడి రైతులను, వి.ఎన్.ఆర్. రీసర్చ్ స్టేషన్ నిర్వాహకులను కోరారు. కూరగాయలు, పండ్లతో పాటు మేలు రకమయిన పద్దతులతో సాగవుతున్న వరి సాగును కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు.

దాదాపు ఒకే చోట ఒకే రకమైన పంట 50, 60 ఎకరాల్లో సాగు చేస్తుండటాన్నీ కూడా ముఖ్యమంత్రి కేసిఆర్ పరిశీలించారు. పెద్ద కమతాల వల్ల కలిగే ప్రయోజనాన్ని చూశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా కమతాల ఎకీకరణలను అందుకోసమే తాము ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

ఆ తరువాత ముఖ్యమంత్రి బెమెత్రా జిల్లాలోని కోహడియా గ్రామ పరిధిలోని గ్రీన్ హౌజ్, పాలి హౌజ్ కల్టివేషన్‌ను పరిశీలించారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులను, ఉష్ణోగ్రతల హెచ్చు తగ్గులను, ఈదురు గాలుల లాంటి వైపరీత్యాలను తట్టుకుని మొక్కలు పెరగడం గ్రీన్ హౌజ్ కల్టివేషన్ ద్వారా సాధ్యమని తరచూ చెప్పే ముఖ్యమంత్రి అదే అంశానికి సంబంధించి మరి కొన్ని పద్దతులను కూడా అధ్యయనం చేశారు. మంచి శిక్షణ, రైతులు సంఘటితంగా ఉండటం, ఆధునిక పద్దతులను అవలంభించడం, సాంకేతిక పరిజ్ఞానాన్నీ వినియోగించడం తదితర పద్దతులు

ఛత్తీస్‌గఢ్‌ను ఆదర్శంగా నిలిపాయని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రైతులను ఈ విధంగా చైతన్య పరిచి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. గ్రీన హౌజ్ కల్టివేషన్, కమతాల ఏకీకరణ, సూక్ష్మ సేద్యం తదితర అంశాలన్నీ ఇజ్రాయిల్ నుండి ఛత్తీస్‌గడ్ వరకు రైతులు అవలంభిస్తున్న మెరుగైన పద్ధతులు, రేపటి తెలంగాణలో కూడా ఈలాగే ఉండాలన్నది కేసిఆర్ సంకల్పం.

---------------------------------------------------------------

సిపిఆర్‌ఓ టు సిఎం